# కేకేఆర్ తీన్మార్

**మూడోసారి ఐపీఎల్ చాంప్‌గా కోల్‌కతా నైట్‌రైడర్స్ • ఫైనల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్ చిత్తు**

**ఆల్‌రౌండ్ ప్రదర్శనతో దుమ్మురేపిన రైడర్స్ • రాణించిన స్టార్క్, రస్సెల్, వెంకటేశ్**

**కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) కమాల్ చేసింది. లీగ్ ఆసాంతం అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న కేకేఆర్ ఆఖరి పోరులోనూ అదరగొట్టింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో పూర్తి ఏకపక్షంగా జరిగిన ఫైనల్ పోరులో కోల్‌కతా చిరస్మరణీయ విజయంతో కదంతొక్కింది. సరిగ్గా పదేండ్ల తర్వాత ముచ్చటగా మూడోసారి ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడి సంబురాల్లో మునిగిపోయింది. కోల్‌కతా బౌలర్లు ఆది నుంచే బుల్లెట్ లాంటి బంతులు సంధించిన వేళ భారీ అంచనాలతో తుదిపోరులో అడుగుపెట్టిన హైదరాబాద్ బ్యాటర్లు పేలవ ఆటతీరుతో మూల్యం చెల్లించుకున్నారు. ఈ సీజన్‌లో తమ డాషింగ్ బ్యాటింగ్‌తో రికార్డులు తిరగరాసిన అభిషేక్‌శర్మ, ట్రావిస్‌హెడ్ సింగిల్ డిజిట్ స్కోర్లకు పరిమితమయ్యారు. కేకేఆర్ బౌలర్ల విజృంభణతో వరుసగా వికెట్లు కోల్పోయిన హైదరాబాద్..చివర్లో కెప్టెన్ కమిన్స్ బ్యాటింగ్‌తో పరువు దక్కించుకుంది. సీజన్‌లో బౌండరీల సునామీ సృష్టించిన హైదరాబాద్ ఈ మ్యాచ్‌లో 3 సిక్సర్లు, 8ఫోర్లకు పరిమితమై తుది మెట్టుపై బోల్తాకొట్టింది. స్వల్ప లక్ష్యఛేదనలో ఆదిలోనే సునీల్ నరైన్ నిష్క్రమించినా..వెంకటేశ్ అయ్యర్, గుర్బాజ్ బ్యాటింగ్‌తో కోల్‌కతా అలవోక విజయంతో ఈ యేటి ఐపీఎల్ చాంపియన్‌గా నిలిచింది.**



చెన్నై: పదేండ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ కోల్‌కతా నైట్‌రైడర్స్ ఐపీఎల్‌లో విజేతగా నిలిచింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన కేకేఆర్.. ఆదివారం చెన్నై వేదికగా ఏకపక్షంగా సాగిన ఫైనల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను చిత్తుచిత్తుగా ఓడించి ఈ లీగ్‌లో మూడోసారి కప్పు కొట్టింది. తుదిపోరులో సన్‌రైజర్స్‌ను 8 వికెట్ల తేడాతో ఓడించి అఖండ విజయం సాధించింది. స్టార్క్ (2/14), రస్సెల్ (3/19), హర్షిత్ (2/24) దెబ్బకు హైదరాబాద్ కుదేలవగా తర్వాత 114 పరుగుల లక్ష్యాన్ని రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 10.3 ఓవర్లలోనే ఊదేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ 18.3 ఓవర్లలో 113 పరుగులకే చేతులెత్తేసింది. సారథి పాట్ కమిన్స్ (19 బంతుల్లో 24, 2 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్. ఛేదనలో వెంకటేశ్ అయ్యర్ (26 బంతుల్లో 52 నాటౌట్, 4 ఫోర్లు, 3 సిక్సర్లు) పిడుగులా విరుచుకుపడ్డాడు. స్టార్క్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్', ?? కు 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ' అవార్డులు లభించాయి.

**సన్‌రైజర్స్ సమిష్టి వైఫల్యం:**

ఏడుగురు బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కు పరిమితమైతే నలుగురు రెండంకెల స్కోరు చేశారు. అందులోనూ 9వ స్థానంలో వచ్చిన సారథి కమిన్స్.. 24 పరుగులతో టాప్ స్కోరర్. ఇంతే..! కీలకమైన ఫైనల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్ల ప్రదర్శన ఇది. చెపాక్ పిచ్‌పై రైడర్స్ బౌలర్లు సమిష్టిగా సత్తా చాటితే రైజర్స్ బ్యాటర్లు గంపగుత్తగా చేతులెత్తేశారు. నాకౌట్ మ్యాచ్‌లు అంటేనే నిప్పులు చెరిగే స్టార్క్.. మొదటి ఓవర్లోనే అభిషేక్ శర్మ (2)ను బౌల్డ్ చేసి హైదరాబాద్ వికెట్ల పతనానికి కొబ్బరికాయ కొట్టాడు. ఆ తర్వాత ఏ దశలోనూ దీనికి అడ్డుకట్టపడలేదు. వైభవ్ రెండో ఓవర్లో ట్రావిస్ హెడ్‌ను ఔట్ చేయడంతో అతడు మరోసారి ఉత్తచేతులతోనే వెనుదిరగగా స్టార్క్ 3వ ఓవర్లో త్రిపాఠి (9)నీ ఔట్ చేసి ఎస్‌ఆర్‌హెచ్‌ను కోలుకోకుండా చేశాడు. 4 ఓవర్ల పాటు వికెట్ల పతనానికి అడ్డుకట్ట వేసిన నితీశ్ (13), మార్‌క్రమ్ (20) సైతం హైదరాబాద్‌ను గట్టెక్కించలేకపోయారు. ఆరంభ ఓవర్లలో స్టార్క్, అరోరా చెలరేగితే మిడిల్ ఓవర్లలో రస్సెల్, హర్షిత్.. ఎస్‌ఆర్‌హెచ్ బ్యాటర్ల పనిపట్టారు. క్లాసెన్ (16), సమద్ (4) సైతం నిరాశపరిచారు. ఆఖర్లో కమిన్స్ పుణ్యమా అని సన్‌రైజర్స్ మూడంకెల స్కోరు చేయగలిగింది. కేకేఆర్ ఆరుగురు బౌలర్లను ఉపయోగించగా అందరికీ వికెట్లు దక్కడం విశేషం.

**వెంకటేశ్ ధనాధన్:**

స్వల్ప ఛేదనలో కోల్‌కతా రెండో ఓవర్లోనే నరైన్ (6) వికెట్ కోల్పోయినా వన్‌డౌన్‌లో వచ్చిన వెంకటేశ్ అయ్యర్ కమిన్స్ దళంపై ఉరుములా మీదపడటంతో అసలే చిన్నలక్ష్యం మరింత చిన్నబోయింది. భువీ 3వ ఓవర్లో 4, 6, 6తో 20 పరుగులు రాబట్టగా, నటరాజన్ 6వ ఓవర్లో 3 బౌండరీలు, ఓ సిక్సర్ దంచడంతో మన బౌలర్లు ఏదైనా మ్యాజిక్ చేయకపోతారా! అని ఆశలు పెట్టుకున్న ఆరెంజ్ ఆర్మీ ఫ్యాన్స్ ఆశలు ఆవిరయ్యాయి. మరో ఎండ్‌లో గుర్బాజ్ సైతం వీలుచిక్కినప్పుడల్లా బాదుతూనే అయ్యర్‌కు అండగా నిలవడంతో పవర్‌ప్లే ముగిసేసరికి కేకేఆర్ స్కోరు 72-1గా నిలిచింది. రెండో వికెట్‌కు 91 పరుగులు జోడించిన ఈ జోడీ లక్ష్యం దిశగా సాగుతుండగా.. షాబాజ్ 9వ ఓవర్లో గుర్బాజ్‌ను ఎల్బీగా ఔట్ చేసినా శ్రేయస్ అయ్యర్ (6 నాటౌట్) అండతో వెంకటేశ్.. అర్ధసెంచరీతో పాటు గెలుపు లాంఛనాన్ని పూర్తిచేశాడు.

### సంక్షిప్త స్కోర్లు

**హైదరాబాద్:** 18.3 ఓవర్లలో 113 ఆలౌట్ (కమిన్స్ 24, మార్‌క్రమ్ 20, రస్సెల్ 3/19, స్టార్క్ 2/14).
**కోల్‌కతా:** 10.3 ఓవర్లలో 114/2 (వెంకటేశ్ 52 నాటౌట్, గుర్బాజ్ 39, కమిన్స్ 1/18, షాబాజ్ 1/22)

విజేత: కోల్‌కతా **20** కోట్లు
రన్నరప్: హైదరాబాద్ **12.50** కోట్లు

- ఎమర్జింగ్ ప్లేయర్: నితీశ్‌కుమార్‌రెడ్డి (10 లక్షలు)
- పిచ్ అండ్ గ్రౌండ్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (50 లక్షలు)
- ఫెయిర్‌ప్లే అవార్డు: సన్‌రైజర్స్ హైదరాబాద్
- అత్యంత విలువైన ఆటగాడు: నరైన్ (488 రన్స్, 17 వికెట్లు)-(10 లక్షలు)
- క్యాచ్ ఆఫ్ ద సీజన్: రమన్‌దీప్‌సింగ్ (10 లక్షలు)
- ఆరెంజ్ క్యాప్: విరాట్ కోహ్లీ (741 రన్స్)
- పర్పుల్ క్యాప్: హర్షల్ పటేల్ (24 వికెట్లు)

**1** ఐపీఎల్ ఫైనల్‌లో ఇదే అత్యల్ప స్కోరు. గతం (2013)లో ముంబైతో మ్యాచ్‌లో చెన్నై (125/9) లోయెస్ట్ స్కోరును నమోదు చేసింది.

## నిలకడకు నిలువుటద్దం!

*నమస్తే తెలంగాణ క్రీడావిభాగం*

దశాబ్ద కాలం తర్వాత ఐపీఎల్ ట్రోఫీని సగర్వంగా ముద్దాడిన కేకేఆర్ సీజన్ ఆసాంతం నిలకడగా రాణించింది. గత రెండు సీజన్లలో ఏడో స్థానంతో ముగించిన ఆ జట్టు 2024లో మాత్రం కచ్చితంగా కప్పు కొట్టాలనే కృతనిశ్చయంతో టోర్నీని ఆరంభించింది. తమకు రెండుసార్లు ట్రోఫీని అందించిన గౌతం గంభీర్‌ను మెంటార్‌గా నియమించుకోవడంతో పాటు వేలంలో స్టార్క్‌కు రూ. 24 కోట్లు వెచ్చించిన నైట్‌రైడర్స్.. తమ ప్రణాళికను అక్కడ్నుంచే విజయవంతంగా అమలుచేసింది. పదిజట్ల రణక్షేత్రంలో దిగిన కోల్‌కతా.. ఓపెనర్‌గా నరైన్‌ను పంపించి సగం సక్సెస్ అయ్యింది. ఓపెనర్ (482 పరుగులు)గా విధ్వంసరచన చేసిన అతడు.. బంతితోనూ (17 వికెట్లు) అదరగొట్టాడు. ఫిల్ సాల్ట్ (435) చేసింది తక్కువేమీ కాదు. కేకేఆర్ విజయాలలో ఈ ఇద్దరిదే కీలకపాత్ర. మిడిలార్డర్‌లో రఘువంశీ, వెంకటేశ్ అయ్యర్, శ్రేయస్ అయ్యర్, రస్సెల్ తలా ఓ చేయి వేస్తే ఆఖర్లో రమణ్‌దీప్ సింగ్, రింకూ సింగ్ అదిరిపోయే ముగింపులనిచ్చారు. లీగ్ దశలో పెద్దగా ఆకట్టుకోలేకపోయినా స్టార్క్ (17 వికెట్లు) నాకౌట్‌కు వచ్చేసరికి తన 'ప్రైమ్ మోడ్'లోకి వెళ్లిపోయాడు. నాకౌట్‌లో అతడి బౌలింగ్ ప్రదర్శనలే (3/34, 2/14) ఇందుకు తార్కాణం. ఈసీజన్‌లో కేకేఆర్‌కు దొరికిన మరో పేస్ ఆణిముత్యం హర్షిత్ రాణా (19). ఆండ్రీ రస్సెల్ బ్యాట్‌తో పాటు బంతి (19) తోనూ అద్భుతాలు సృష్టించాడు. వరుణ్ చక్రవర్తి (21) స్పిన్‌తో ప్రత్యర్థికి చెమటలు పట్టించాడు. ఇక ప్లేఆఫ్స్ దాకా (14 మ్యాచ్‌లలో 9 విజయాలతో 20 పాయింట్లు) ఓ రేంజ్ ఆట ఆడిన కేకేఆర్.. నాకౌట్ దశలో 'ప్రీమియర్' ఆట చూపించి ట్రోఫీని సొంతం చేసుకుంది.. సన్‌రైజర్స్‌ను ప్లేఆఫ్స్‌లో రెండు సార్లూ చిత్తుగా ఓడించి ట్రోఫీ సొంతం చేసుకుంది. గౌతీ మెంటార్‌గా, చంద్రకాంత్ పండిట్ కఠినమైన కోచింగ్ పాఠాలతో పాటు శ్రేయస్ అయ్యర్ సారథ్య సామర్థ్యంతో కోల్‌కతా.. చెపాక్‌లో కొత్త కథను రాసింది.

## దీప స్వర్ణ చరిత్ర

**ఏషియన్ జిమ్నాస్టిక్స్‌లో భారత్‌కు తొలి పసిడి**



తాష్కెంట్: భారత స్టార్ జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ కొత్త చరిత్ర లిఖించింది. డోపింగ్ ఆరోపణలతో 21 నెలల పాటు సస్పెన్షన్ ఎదుర్కొన్న దీప అద్భుత ప్రదర్శనతో సత్తాచాటింది. ఏషియన్ సీనియర్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో దీప పసిడి పతకంతో మెరిసింది. ఈ టోర్నీలో స్వర్ణం గెలిచిన తొలి భారత జిమ్నాస్ట్‌గా దీప అరుదైన రికార్డు సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన మహిళల వాల్ట్ ఫైనల్లో ఈ సీనియర్ జిమ్నాస్ట్ 13.566 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. కిమ్‌సాన్ హ్యాంగ్(13.466), జో క్యాంగ్ బోల్(12.966) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.

## రన్నరప్ సింధు

**మలేషియా మాస్టర్స్ ఫైనల్స్‌లో ఓటమి**



కౌలాలంపూర్: ప్రతిష్టాత్మక పారిస్ ఒలింపిక్స్‌కు ముందు మలేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టైటిల్ గెలిచి ఆత్మవిశ్వాసంతో విశ్వక్రీడల్లోకి వెళ్లాలనుకున్న స్టార్ షట్లర్ పీవీ సింధుకు నిరాశే ఎదురైంది. సుమారు ఏడాదికాలం తర్వాత ఓ టోర్నీ ఫైనల్ చేరిన ఆమె కౌలాలంపూర్ వేదికగా ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్ పోరులో 21-16, 5-21, 16-21 తేడాతో చైనా అమ్మాయి వాంగ్ జి యి చేతిలో పరాభవం పాలైంది. 79 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో తొలి రౌండ్‌ను గెలుచుకున్నా తర్వాత తడబడిన సింధు.. వరుసగా రెండు రౌండ్లలోనూ ఓడి ఓటమివైపు నిలిచింది. 2022 లో సింగపూర్ ఓపెన్ టైటిల్ గెలిచిన తర్వాత సింధు మళ్లీ.. 'బ్యాడ్మింటన్ సూపర్' టోర్నీలలో విజేతగా నిలవలేదు. 2023 మ్యాడ్రిడ్ ఓపెన్ తర్వాత ఫైనల్‌కు చేరిన సింధు.. మరోసారి రన్నరప్‌తోనే సరిపెట్టుకుంది.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.